WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteluguDaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ | బుధవారం, జూన్ 3, 2026 | సంపుటి:13 | సంచిక :9 | పేజీలు:4 | వెల:5

# తెలంగాణ 'పంట'తో దేశానికి దిక్సూచి

రైతు సంక్షేమమే రాష్ట్రాభివృద్ధికి పునాది: సీఎం రేవంత్

యాసంగి ధాన్య సేకరణలో దేశంలో తెలంగాణదే అగ్రస్థానం

వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు త్వరలో శ్రీకారం

సెప్టెంబర్ 17 నాటికి మరో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

ఉద్యోగాల భర్తీకి నిరంతర నోటిఫికేషన్లు.. ఈ నెలలోనే కొత్త ప్రకటనలు

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా తెలంగాణ



హైదరాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా కీలక కార్యాచరణను ప్రకటించారు. వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు, ఉపాధి నుంచి మౌలిక వసతుల వరకు ప్రతి రంగంలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి, తెలంగాణ రైతాంగం సాధిస్తున్న విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర భూములు అన్ని రకాల పంటల సాగుకు అనుకూలమని, రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా కూరగాయలు, పండ్లు, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 2025--26 సంవత్సరంలో రాష్ట్రంలో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదైందని సీఎం వెల్లడించారు. గత రెండున్నరేళ్లలో ధాన్య కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ.82,840 కోట్లు ఖర్చు చేసిందన్నారు. యాసంగి సీజన్‌లో మాత్రమే 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.11,903 కోట్లు జమ చేసినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా యాసంగిలో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60 శాతం ఉండటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్నల సాగులో రైతులు కొత్త రికార్డులు సృష్టించారని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడే దిశగా హైడ్రా ద్వారా పెద్ద ఎత్తున చర్యలు చేపట్టినట్లు సీఎం తెలిపారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్ రూపురేఖలను మార్చబోతున్నాయని చెప్పారు. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళిక అమలులో ఉందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో విమానాశ్రయాల ఏర్పాటు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని తెలిపారు. అదే సమయంలో ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరుతున్నామని, తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణంపై సానుకూల నిర్ణయం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద ఉద్రిక్తత
# భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్‌లో జనసేన సభకు పోలీసుల అనుమతి నిరాకరణ

గచ్చిబౌలిలో జరగాల్సిన కార్యక్రమానికి శాంతిభద్రతల కారణాలు

అనుమతి కోరుతూ జనసేన వేసిన పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద భారీగా మోహరించిన పోలీసులు


నివాసం వద్దకు చేరుకున్న కార్యకర్తలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత



హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనసేన పార్టీ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ తన ఇంటి వద్ద ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు చేరుకోవడంతో పోలీసులు భారీగా మోహరించి వారిని అడ్డుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ పేరిట ఓ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2,000 మందితో నిర్వహించే ఈ ఇండోర్ సమావేశానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరింది. అయితే, శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ అంతరాయం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల వంటి కారణాలను చూపుతూ సైబరాబాద్ పోలీసులు ఈ సభకు అనుమతి నిరాకరించారు. పోలీసుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ జనసేన పార్టీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. మంగళవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం జనసేన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో పవన్ కళ్యాణ్ తన నివాసం నుంచే సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య మీడియా, పార్టీ నేతలతో మాట్లాడతానని ప్రకటించారు. ఈ సమాచారంతో కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలిరాగా, పోలీసులు వారిని నిలువరించారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి: చంద్రబాబు

2027 గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశం



2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని, ఇది యాత్రికులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు ఉన్న ప్రాంతాన్ని 'అఖండ గోదావరి కారిడార్'గా అభివృద్ధి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అభివృద్ధి చేసే అన్ని మౌలిక సదుపాయాలు గోదావరి బేసిన్ ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పుష్కరాలతో రాజమహేంద్రవరం ఒక ప్రధాన మహానగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు దాదాపు 9.95 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం రహదారి, రైల్వే ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టాలని, పుష్కర ఘాట్లకు క్రమపద్ధతిలో నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రత్యేక రైళ్లు, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన క్షేత్రస్థాయి పర్యటన సిఫార్సులను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. జూన్ 24 నాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఆ తర్వాత పుష్కరాలకు అధికారికంగా కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు.



## ఆగస్టు 6 లోపు ట్యాంక్ బండ్‌పై ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: కవిత

జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్న కవిత

అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్

డిమాండ్లను నెరవేర్చకపోతే భారీ ఉద్యమం చేస్తామని హెచ్చరిక

# కర్ణాటక ముఖ్యమంత్రిగా నేడు డీకే ప్రమాణం

సిద్ధరామయ్య యుగానికి ముగింపు.. కాంగ్రెస్‌లో కొత్త శక్తి


మంత్రివర్గంలో పాత-కొత్తలకు సమతూకం

ఉప ముఖ్యమంత్రి పదవులపై చివరి వరకు ఉత్కంఠ

ఖర్గే, రాహుల్ సమక్షంలో అధికార మార్పిడి



# కర్ణాటక ముఖ్యమంత్రిగా నేడు డీకే శివకుమార్ ప్రమాణం



బెంగళూరు/న్యూఢిల్లీ, జూన్ 3: కర్ణాటక రాజకీయాల్లో కీలక మలుపు తిరిగింది. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో అధికార పగ్గాలు సిద్ధరామయ్య నుంచి డీకే శివకుమార్ చేతిలోకి మారనున్నాయి. బుధవారం సాయంత్రం 4.05 గంటలకు బెంగళూరులోని లోక్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో డీకే శివకుమార్ రాష్ట్ర 25వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు తొలి విడతలో పలువురు మంత్రులు కూడా బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో దశాబ్దకాలంగా సాగుతున్న నాయకత్వ పోరుకు తాత్కాలికంగా తెరపడగా, పార్టీ భవిష్యత్ వ్యూహాలకు అనుగుణంగా అధిష్టానం ఈ మార్పును అమలు చేసింది. గత నెల 30న కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ అధికారికంగా సీఎం పదవిని అధిరోహించబోతున్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు మంగళవారం డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సూర్జేవాలాతో విస్తృతంగా చర్చించారు. మంత్రివర్గ కూర్పు, ప్రాంతీయ సమీకరణాలు, కుల సమతూకం, ఎన్నికల వ్యూహాలు, పార్టీ భవిష్యత్ నాయకత్వంపై ఈ సమావేశాల్లో నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. తొలి విడతలో దాదాపు 14 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. డీకే కేబినెట్‌లో అనుభవజ్ఞులకు పెద్దపీట వేస్తూనే యువతకు కూడా అవకాశం కల్పించే ప్రయత్నం జరుగుతోంది. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు కేజే జార్జ్, ఎంబీ పాటిల్, జి.పరమేశ్వర్, ఈశ్వర ఖండ్రె, రామలింగారెడ్డి, కేహెచ్ మునియప్ప, సతీశ్ జార్కిహొళి, హెచ్‌సీ మహదేవప్ప, హెచ్‌కే పాటిల్, యూటీ ఖాదర్, భైరతి సురేశ్, చెలువరాయస్వామి తదితరుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గాన్ని రూపొందించాలని అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది.

**డిప్యూటీ సీఎంలపై ఉత్కంఠ**

ఈసారి ఒకరికి మించి ఉప ముఖ్యమంత్రి పదవులు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దళిత వర్గానికి చెందిన ఒక సీనియర్ నేతకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించడం దాదాపు ఖాయమని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. జి.పరమేశ్వర్, ప్రియాంక్ ఖర్గే పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. లింగాయత్, దళిత, ఓబీసీ వర్గాల మధ్య సమతూకం కోసం అధిష్టానం ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది.

**సీడబ్ల్యూసీలో సిద్ధరామయ్యకు కీలక స్థానం**

అధికార మార్పిడికి సమాంతరంగా సిద్ధరామయ్యకు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన బాధ్యత అప్పగించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా ఆయనను నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకోకుండా, జాతీయ రాజకీయాల్లోనూ ఆయన పాత్ర కొనసాగించాలనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**'కావేరి'లోనే సిద్ధరామయ్య**

ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకున్నప్పటికీ సిద్ధరామయ్య ప్రస్తుతం నివసిస్తున్న అధికారిక సీఎం నివాసం 'కావేరి'లోనే కొనసాగనున్నట్లు సమాచారం. డీకే శివకుమార్‌కు కొత్త ప్రభుత్వ నివాసాన్ని కేటాయించనున్నారు. ఇద్దరు నేతల మధ్య పరస్పర అవగాహనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య 2028 వరకు 'కావేరి'లోనే ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**కాంగ్రెస్‌కు కీలక పరీక్ష**

లోక్‌సభ ఎన్నికల అనంతరం కర్ణాటకలో జరుగుతున్న ఈ నాయకత్వ మార్పు కాంగ్రెస్‌కు కీలక రాజకీయ పరీక్షగా మారింది. సిద్ధరామయ్య–డీకే వర్గాల మధ్య సమతూకం సాధిస్తూ పార్టీ ఐక్యతను కాపాడడం కొత్త ముఖ్యమంత్రి ముందున్న ప్రధాన సవాలుగా కనిపిస్తోంది. అధిష్టానం ఆశీస్సులతో సీఎం పదవిని చేపడుతున్న డీకే శివకుమార్... పరిపాలనతో పాటు పార్టీని ఎన్నికల యంత్రాంగంగా మరింత బలోపేతం చేయగలరా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

# ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదమే ప్రమాదకరం



హైదరాబాద్, జూన్ 3 : తెలంగాణలో తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న విమర్శలకు జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘాటుగా స్పందించారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను తీవ్రంగా ఖండించిన ఆయన, ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదమే దేశానికి మరింత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో జనసేన కార్యకలాపాలను అడ్డుకోవాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించాలనుకున్న "నవ నిర్మాణ సభ"కు అనుమతి నిరాకరించడంతో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్, దాదాపు గంటన్నరపాటు పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ ప్రజల పట్ల తనకు ఎప్పుడూ గౌరవమే తప్ప విద్వేషం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో అడుగుపెట్టొద్దని, సభలు నిర్వహించొద్దని కొందరు రాజకీయ నాయకులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్న పవన్, అలాంటి బెదిరింపులకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. "తెలంగాణ ఏమైనా ఎవరి వ్యక్తిగత జాగీరా? ఇది నా దేశం. భారతదేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు నాకు ఉంది. నన్ను అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. దాడులు చేస్తామంటే చిరునవ్వుతో ఎదుర్కొంటాం. భయం అనే పదం మా నిఘంటువులో లేదు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని పవన్ ప్రకటించారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇతర పార్టీలతో పొత్తుల అంశం వారి నిర్ణయమని, కానీ తెలంగాణలో జనసేన తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. "హైదరాబాద్ నడిబొడ్డునే జనసేన పుట్టింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు నన్ను ప్రభావితం చేశాయి. రాజకీయ లాభనష్టాలకు అతీతంగా తెలంగాణపై మాకు మమకారం ఉంది" అని చెప్పారు.

**విభజనకు కాదు.. విభజన తీరుకే వ్యతిరేకం**

తెలంగాణ ఏర్పాటును తాము ఎప్పుడూ వ్యతిరేకించలేదని, కానీ రాష్ట్ర విభజన జరిగిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించామని పవన్ స్పష్టం చేశారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అప్పుడే చెప్పామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించామని, సామాజిక తెలంగాణ కోసం తాము కూడా కోరుకున్నామని తెలిపారు. "నాకు కష్టకాలంలో అండగా నిలిచింది తెలంగాణ ప్రజలే. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా తెలంగాణ నుంచే నాకు మద్దతు లభించింది. అలాంటి ప్రజలపై నాకు ఎలాంటి వ్యతిరేకత ఉండదు" అని చెప్పారు. ప్రాంతీయవాదాన్ని ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ నేతలు మాట్లాడటం ఆశ్చర్యకరమని పవన్ అన్నారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. "వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు మౌనంగా ఉన్నవాళ్లు, ఇప్పుడు మాపై విమర్శలు చేస్తున్నారు. అదే నాయకులు అప్పట్లో అధికార పదవులు అనుభవించారు. ఇప్పుడు ప్రాంతీయవాదం పేరుతో రాజకీయాలు చేస్తున్నారు" అని ఆరోపించారు. ఒక రాజకీయ విశ్లేషకుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు స్పందించానని, దాన్నే కొందరు అనవసర వివాదంగా మార్చారని పవన్ తెలిపారు. "అమిత్ షా గురించి తప్పుడు ప్రచారం చేస్తే నేను సమాధానం చెప్పకూడదా? దానికి ప్రాంతీయ రంగు పులమడం సరైంది కాదు" అని పేర్కొన్నారు. తన రాజకీయ లక్ష్యం అధికారాన్ని సాధించడం కాదని, సమాజంలో మార్పు తీసుకురావడమేనని పవన్ స్పష్టం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లోనే అధికారాన్ని ఆశించని నేను, తెలంగాణలో ఎందుకు పదవుల కోసం వస్తాను? ప్రజల విశ్వాసం గెలుచుకోవడమే మా లక్ష్యం. ప్రస్తుతం తెలంగాణలో జనసేనకు పెద్ద బలం లేకపోయినా, ప్రజల మధ్య పనిచేస్తూ ముందుకు వెళ్తాం" అని తెలిపారు. తనపై వస్తున్న చెరువు ఆక్రమణ ఆరోపణలను కూడా పవన్ ఖండించారు. తన భూమి అక్రమమని నిరూపిస్తే వెంటనే ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధమని ప్రకటించారు. "నేను చెరువును కబ్జా చేశానని నిరూపిస్తే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి రాసిస్తా. అక్కడ గోశాల నిర్వహిస్తున్నాం. రాజకీయ కారణాలతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు" అని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్వేషాలు దేశ ఐక్యతకు ప్రమాదకరమని హెచ్చరించిన పవన్ కల్యాణ్, తెలంగాణ ప్రజలతో తన అనుబంధం కొనసాగుతుందని చెప్పారు. చివరగా "జై తెలంగాణ.. జై హింద్" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

## పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగొద్దని మేం చెప్పడం లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే ఇక్కడ సభలు నిర్వహించుకోవాలని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని మేం ఆపడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే హైదరాబాద్‌లో సభ పెట్టాలనుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 'నవ నిర్మాణ సంకల్ప సభ' నిర్వహించాలని పవన్ కల్యాణ్ మొదట భావించారు. అయితే, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ సభకు అనుమతి నిరాకరించారు. దీంతో జనసేనాని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పరిణామాలపై హుస్నాబాద్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని పవన్ దెబ్బతీశారు. అలాంటి వ్యక్తి, తెలంగాణకు ఎంతో భావోద్వేగమైన ఆవిర్భావ దినోత్సవాన సభ ఎలా పెడతారు?" అని ప్రశ్నించారు. పవన్‌ను 'పెయిడ్ ఆర్టిస్ట్'గా అభివర్ణించిన పొన్నం, ఆయన పర్యటన వెనుక బీజేపీ వంటి ఇతర పార్టీల అజెండా ఏమైనా ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం పవన్ తెలంగాణకు వచ్చినప్పుడు ప్రభుత్వం ఆయనకు ప్రోటోకాల్ ఇచ్చి స్వాగతించిందని గుర్తుచేశారు. ఆయన రాష్ట్రానికి రావడాన్ని ఎవరూ అడ్డుకోరని, కానీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. దివంగత ప్రజా గాయకుడు గద్దర్‌కు సంబంధించిన వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ పవన్ క్షమాపణ చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలను తెలంగాణ స్వాగతిస్తుందని మంత్రి అన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామని, తెలంగాణలో తిరగవచ్చని స్పష్టం చేశారు. తెలంగాణలో ఏపీ ప్రజలకు ఏం పని అని తాము అనడం లేదని వ్యాఖ్యానించారు. కానీ తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినే చర్యలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ లేదా బీఆర్ఎస్ నుంచి చిట్టీలు వస్తున్నాయా అని నిలదీశారు.



## తెలంగాణలో అమల్లోకి అడ్వకేట్ల పరిరక్షణ చట్టం-2026

తెలంగాణలో న్యాయవాదుల భద్రతకు భరోసా కల్పిస్తూ రూపొందించిన 'అడ్వకేట్ల పరిరక్షణ చట్టం–2026' మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తూ అధికారికంగా నోటిఫై చేసింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ జీఓ నెం.41ను జారీ చేసింది. వృత్తిపరమైన విధుల్లో ఉన్న న్యాయవాదులపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో అసెంబ్లీలో 'తెలంగాణ అడ్వకేట్ల పరిరక్షణ బిల్లు–2026'ను ఆమోదించింది. గవర్నర్ ఆమోదం పొందిన ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం న్యాయవాదులకు పోలీస్ రక్షణ, తప్పుడు కేసుల నుంచి భద్రత, వేధింపులపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక యంత్రాంగం, బెదిరింపుల నుంచి రక్షణ వంటివి కల్పిస్తారు. ఇటీవల హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన కొద్దిరోజులకే ఈ చట్టం అమలులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే 23న మసాబ్ ట్యాంక్‌లోని తన ఇంటి వద్ద మొయిజుద్దీన్‌ను ఒక కారుతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టడంతో ఆయన మరణించారు. ఈ కేసులో కాంగ్రెస్ నేత ముజాహిద్ ఆలం ఖాన్, అతని తండ్రి సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వక్ఫ్ ఆస్తుల వివాదమే ఈ హత్యకు కారణమని, రూ.15 లక్షల సుపారీ ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ చట్టం న్యాయవాదుల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారు నిర్భయంగా విధులు నిర్వర్తించడానికి దోహదపడుతుందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు గతంలో తెలిపారు. కర్ణాటక, రాజస్థాన్ తర్వాత దేశంలో ఇలాంటి చట్టాన్ని తీసుకొచ్చిన మూడో రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం.

## జూన్ 2 మరిచిపోలేని రోజు: కేటీఆర్




హైదరాబాద్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు ముగింపు పలికిన జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉద్యమ కాలంలో వినిపించిన "తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.

## ఆగస్టు 6 లోపు ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: కవిత



తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి రోజైన ఆగస్టు 6వ తేదీ లోపు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తయినప్పటికీ, స్వరాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన వెన్నెముకగా నిలిచిన జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రభుత్వం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆగస్టు 6 లోపు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, కనీసం తమ పార్టీకైనా అనుమతి ఇవ్వాలని, తామే స్వయంగా ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూనే, స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఆమె ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆమె కోరారు. అలాగే జూలై 2వ తేదీ లోపు అమరవీరుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే, తమ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ వేదికగా ఒక భారీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, పెద్ద ఎత్తున వంటా–వార్పు నిరసన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను మరవకుండా ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించాలని హితవు పలికారు.

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి: భట్టి

**అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న మల్లు భట్టి**

**రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రత్యర్థులే లేరని వ్యాఖ్య**

**బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శ**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ 'ఎస్ఐఆర్ మ్యాపింగ్' అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. "భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ" అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.





# గ్రేట్ జాబ్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



**బెల్ట్ షాప్ ల పై ఉక్కుపాదం మోపిన గౌరవ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**అర్ధరాత్రి స్వయంగా వెళ్లి బెల్ట్ షాప్ నిర్వాహకుల ను పట్టుకొని ఎక్సైజ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి దగ్గర ఉండి పట్టించిన గౌరవ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**మహిళ ల విజ్ఞప్తి మేరకు అర్ధరాత్రి చర్యలు**

**బెల్ట్ షాప్ ల తో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడే వారు ఎంతటి వారు అయిన వదిలి పెట్టె ప్రసక్తే లేదు, చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటన**

మాదాపూర్, నవతరం: హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బెల్టు శాపుల నిర్వాహకులు కొన్ని సంవత్సరాలుగా కల్తీ మద్యం అమ్మకాలు కొనసాగిస్తూ... ఎక్సైజ్ అధికారులకు సవాలు చేస్తూ... లా అండ్ ఆర్డర్ సమస్యలు తీసుకువస్తూ.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇదే తరహాలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అదే తంతు కొనసాగుతుంది. ఇదే నేపథ్యంలో స్థానిక గోకుల్ ప్లాట్స్ పరిధిలో గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడం తోనే బెల్ట్ షాపుల ఆగడాలు పెరిగిపోతున్నాయంటూ ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు స్థానిక మహిళలు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సమస్య పై స్పందించి, చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పిఏసి చైర్మన్ కు ప్రత్యేక ధన్య వాదాలు తెలియచేశారు కాలనీవాసులు. మాదాపూర్ డివిజన్ పరిధి లోని గోకుల్ ప్లాట్స్ కాలనీ లో విచ్చలవిడిగా బెల్ట్ షాప్ లు ఓపెన్ చేసి నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు న్నారు, కాలనీలలో ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నారని స్థానిక మహిళ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి విన్నవించుకోగా వెంటనే స్పందించిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్వయంగా అర్ధరాత్రి వెళ్లి బెల్ట్ షాప్ ల నిర్వాహకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.













# తెలంగాణ ఉద్యమ ఆశయాలు నెరవేరాయా?

### తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ



కూకట్ పల్లి, నవతరం: తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాకుండా ఆంధ్ర, తెలంగాణను కలిపి ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేసి ఆంధ్ర రాజకీయ నాయకులు తెలివిగా తెలంగాణ భూములను, ఆర్థిక వనరులను, నీళ్లను, నిధులను, ఉద్యోగాలను దోచుకోవడం మొదలుపెట్టారు. అది ఎంతలా అంటే యావత్ తెలంగాణనే శాసించేలా. దీంతో తెలంగాణలో పనిలేక ప్రజలు, భూములు లేక రైతులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇలా యావత్ తెలంగాణ నిత్యం ఆకలితో, ఆత్మహత్యలతో అల్లాడుతూ ఉన్న భూమిని అమ్ముకొని, వలసలు పోయి కూలి పని చేసుకునే స్థితికి తీసుకొచ్చారు. పైగా తెలంగాణలో అన్ని ఉద్యోగాలలో ఆంధ్రావాళ్లే తిష్ఠ వేసి పెత్తనం చెలాయిస్తుంటే, తెలంగాణలో చదువుకున్న యువత నిరుద్యోగులుగా మారుతున్న తీరును చూసి తట్టుకోలేక "మా ఉద్యోగాలు మాకే కావాలంటూ" నిరుద్యోగులతో మొదలైన 'ముల్కీ ఉద్యమం' నుంచి 1969 తొలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చి, 369 మంది అమరులయ్యారు. ఆ ఉద్యమరూపం ఎటు దారితీస్తుందోననే భయం ఒక్కసారిగా ఆంధ్ర పెత్తందారి పాలకులలో మొదలయ్యింది. దాంతో తెలంగాణ నాయకులకు పదవులను, డబ్బులను ఆశ చూపి, ఆ ఉద్యమాన్ని కుట్రలతో కూడుకున్న ఒప్పందాలతో ఆంధ్ర పాలకులు బలితీసుకున్నారు. తొలి దశ ఉద్యమ లోపాలను సవరించుకుంటూ 'నీళ్లు, నిధులు, నియమాకాల' కోసం మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. అన్ని రంగాల ప్రజలకు చేరువవుతూ అందరి సంపూర్ణ మద్దతుతో బలమైన సైద్ధాంతిక పునాదులతో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఉద్యమ దశ--దిశను నిర్దేశించారు. ఆ ఉద్యమం ప్రజల నుంచి స్వచ్ఛందంగా రావడంతో ఆంధ్ర పాలకుల రాజకీయ ఎత్తుగడలు, కుట్రలు, కుతంత్రాలు, డబ్బు, పదవులు, బలం, బలగం ఏవీ పనిచేయలేదు. ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, తెలంగాణ యూనివర్సిటీలు ఉద్యమాలకు అడ్డాగా మారి మొత్తం తెలంగాణ ప్రజలకు అన్ని యూనివర్సిటీల విద్యార్థి ఉద్యమకారులు అండగా నిలబడ్డారు. ఈ పోరాటంలో దాదాపు 1,200 మందికి పైగా విద్యార్థులు అమరులైనా చెక్కుచెదరని ధైర్యంతో తెలంగాణ సాధించే వరకు విద్యార్థి లోకం పోరాడుతూనే ఉంది. అనేక మంది కళాకారులను ఐక్యం చేస్తూ గద్దర్ సాగించిన సాంస్కృతిక ఉద్యమం యావత్ తెలంగాణ బిడ్డలను కదిలించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు తన ఆటపాటలతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ పాడిన పాటలు ప్రజల గుండెలను రగిలించాయి. రాస్తారోకో, వంటావార్పు, రైల్ రోకో, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన విద్యార్థుల సింహగర్జన సభలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో నిలిచిపోయే ప్రధాన ఘట్టాలు. ఈ ఉద్యమంలో తమవంతు పాత్ర నిర్వహించాలని రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, లాయర్లు, డాక్టర్లు, పోలీసులు సైతం తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. అనేక కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు ఎవరికి వారే స్వతంత్ర జేఏసీలుగా ఏర్పాటు చేసుకొని సొంత డబ్బులతో ఉద్యమాన్ని నడిపించారు. నడక నేర్చిన పిల్లగాండ్ల నుంచి పండు ముసలి వరకు తెలంగాణ ఉద్యమాన్ని తమ భుజస్కందాలపై మోస్తూ ఆంధ్ర పాలకుల నుంచి తెలంగాణకు విముక్తి కలిగించారు. తెలంగాణ కోసం అనేకమంది విద్యార్థులు అమరులుగా మారడాన్ని చూసి, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, అప్పటి యూపీఏ ప్రభుత్వం చలించి పార్లమెంటును దిగ్బంధం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లును ఆమోదించారు. దీంతో 2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ ఉద్యమాన్ని ప్రతిసారి సజీవంగా నిలబెడుతూ విజయతీరాలకు చేర్చడంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల పాత్ర ప్రముఖమైనది. ఈ శతాబ్దపు అతిపెద్ద ఉద్యమంగా తెలంగాణ ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అలాంటి అమరవీరుల చరిత్రను ముందు తరాలకు చెప్పడం బుద్ధిజీవులుగా మన బాధ్యత. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎప్పటికీ అన్యాయాన్ని, దోపిడీని, అణిచివేతలను, నిరంకుశత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉండాలి. తెలంగాణ చరిత్రను, అస్తిత్వాన్ని ఎవరెంత కించపరచినా, హేళన చేసినా అది చెరిగిపోయేది కాదు. తెలంగాణ ఏర్పడి పన్నెండు సంవత్సరాలు గడుస్తున్నా 'నీళ్లు, నిధులు, నియమాకాల' విషయంలో ఇంకా వెనుకబడే ఉన్నాం. వాటిని సాధించుకోవడంలో ఆనాటి పోరాట స్ఫూర్తి పాలకులలో, నాయకులలో లేదు. దాన్ని ప్రశ్నించే ఉద్యమ గొంతులు కూడా ఎందుకో తడబడుతున్నాయి. నిరుద్యోగులు, రైతులు, ఉద్యమకారులు, విద్యార్థులు ఇంకా నిరాశతోనే ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దీన్ని పాలకులు గమనించి భవిష్యత్తులో రాబోయే పెను ఉద్యమాల ప్రమాదాన్ని నివారించి 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఆశయాలను' నెరవేర్చాల్సిన అవసరం ఉంది.

# కాంగ్రెస్ అసమర్థతకు నిలిచిపోయిన రోడ్డు పనులే సాక్ష్యం

**దమ్మపేట మండలంలో స్తంభించిపోయిన రహదారుల నిర్మాణాలు**

**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**

**మల్లారం, గాంధీనగర్--మందలపల్లి, జలవాగు రోడ్డు పనుల అర్థాంతర నిలిపివేత**

**అసంపూర్తి పనులతో ప్రమాదకరంగా మారిన లంక ప్రాంత ప్రయాణం**

**వెంటనే స్పందించకుంటే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరిక**

**మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**








దమ్మపేట, జూన్ 2 (నవతరం ప్రతినిధి -ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): దమ్మపేట మండలంలో నిలిచిపోయిన రోడ్డు పనులే కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు సజీవ సాక్ష్యాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వేగంగా సాగిన అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో పూర్తిగా స్తంభించిపోయాయని ఆరోపించారు. కొత్త పనులు తీసుకురావడం చేతకాని ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయలేని దుస్థితిలో ఉందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రారంభించిన మల్లారం రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారని, గాంధీనగర్--మందలపల్లి రహదారి పనులు ఎక్కడికక్కడ స్తంభించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. మందలపల్లి సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, జలవాగు రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. పెద్దగొల్లగూడెం--మల్కారం రహదారిలోని లంక ప్రాంతంలో పనులను మధ్యలోనే ఆపివేయడంతో ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. గుత్తావారిగూడెం--గంగులగూడెం రహదారి పరిస్థితి మరింత దారుణంగా తయారై ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున వేదికలపై గొప్పలు చెప్పుకోవడం కంటే అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులకు ఈ రోడ్లే నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. లేకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వ డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలి

**అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్**

**లక్షల జీతాలు తీసుకుంటూ విధులకు డుమ్మా.. రోగుల పట్ల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**

**ప్రైవేట్ క్లినిక్‌ల కోసం పేద రోగులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆరోపణ**

**సమయానికి అందుబాటులో ఉండని డాక్టర్లు, సూపరింటెండెంట్.. చర్యలకు డిమాండ్**

**పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరిక**




అశ్వారావుపేట, జూన్ 2(నవతరం ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ కూడా రోగులకు అందుబాటులో ఉండడం లేదని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల జీతాలు పొందుతున్న కొందరు వైద్యులు విధులకు సమయానికి హాజరు కాకుండా రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా కొంతమంది వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను తమ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వైద్యులపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల బాధ్యత అని, ఇకనైనా వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వూకే ముత్తయ్య దొర, వూకే నాగేశ్వరరావు, రాంబాబు తదితర ఆధార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## వెంకమ్మ చెరువు వరద కాలువను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

నవతరం ప్రతినిధి: ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం గ్రామ పరిధిలో ఉన్న వెంకమ్మ చెరువు వరద కాలువను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు భద్రత, వరద నీటి ప్రవాహం, కాలువ సామర్థ్యం, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. వెంకమ్మ చెరువు ఈ ప్రాంత వ్యవసాయానికి కీలకమైన నీటి వనరుగా నిలుస్తుండటంతో పాటు రామన్నగూడెం, పరిసర గ్రామాల రైతులకు సాగునీటి అవసరాలను తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో చెరువులో నీటి నిల్వలు పెరిగిన పరిస్థితిలో వరద కాలువ సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్న విషయాన్ని మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా కాలువ వెడల్పు, లోతు, నీటి ప్రవాహ మార్గం, ఎక్కడైనా ఆక్రమణలు లేదా అవరోధాలు ఉన్నాయా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడం, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే చెట్లు, పొదలను తొలగించడం, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టడం వంటి చర్యలను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, కాలువల ఆధునీకరణ ద్వారా గ్రామీణ వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. భారీ వర్షాలు కురిసే సమయంలో గ్రామాలు, పంట పొలాలకు ఎలాంటి నష్టం జరగకుండా వరద కాలువలు సమర్థవంతంగా ఉండాలని, అందుకోసం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. చెరువుల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు అందుతుందని, పశువులకు తాగునీటి సమస్య కూడా తీరుతుందని వివరించారు. అందువల్ల చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని చెరువులు, కాలువలు, సాగునీటి వనరుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వెంకమ్మ చెరువు వరద కాలువ బలోపేతం కావడం ద్వారా రామన్నగూడెం సహా పరిసర గ్రామాల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలు, పంటల సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కాలువల నిర్వహణ తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశీలన సందర్భంగా స్థానిక రైతులు, గ్రామస్తులు తమ సమస్యలను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో కాలువల ద్వారా నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో పూడిక తొలగింపు, కాలువ విస్తరణ అవసరమని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతు నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఎన్విడియా సీఈఓ ఒక్క ప్రకటనతో ఒక్కరోజే 25 శాతం పెరిగిన షేరు..

స్టాక్ మార్కెట్లలో అప్పుడప్పుడు అద్భుతాలు జరుగుతుంటాయి. స్టాక్స్ ఊహించని రీతిలో పెరుగుతుంటాయి. దీంతో ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురుస్తోంది. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ సీఈఓ జెన్సెన్ హువాంగ్ చేసిన ఒక్క ప్రకటనతో మరో టెక్ కంపెనీ స్టాక్ ఒక్కరోజే 25 శాతానికిపైగా దూసుకెళ్లింది. దీని గురించి చూద్దాం. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌కు లోబడి ఉంటాయన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఊహించని స్థాయిలో హెచ్చుతగ్గులు, ఒడుదొడుకులు ఉంటాయి. ఎన్నో అంశాలు స్టాక్ మార్కెట్‌పై ప్రభావితం చూపుతాయి. ఆర్థిక నిపుణుల సలహా మేరకు పెట్టుబడులు పెట్టడం మంచిదని చాలా మంది చెబుతుంటారు. అప్పుడు కాస్త నష్టభయం తగ్గుతుందని చెబుతుంటారు. ఇక స్టాక్ మార్కెట్లో కొన్ని స్టాక్స్ అప్పటికప్పుడు భారీగా పెరుగుతుంటాయి. అదే సమయంలో కొన్ని కారణాలతో అవే స్టాక్స్ భారీగా పతనం కూడా అవుతుంటాయి. ఇక్కడ చిన్న చిన్న ప్రకటనలతో కూడా స్టాక్స్ భారీ హెచ్చుతగ్గులకు లోనవుతుండటం గమనించొచ్చు. అందుకే ఇక్కడ ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ఫలితాలు, ప్రణాళికలు ఇతర కారణాల గురించి తెలుసుకోవాలి. చాలా వరకు స్టాక్స్ మహా అంటే అప్పర్ సర్క్యూట్, లోయర్ సర్క్యూట్ 5 శాతం, 10 శాతం, 15 శాతం.. మరీ పెద్ద కారణం ఉంటే 20 శాతం వరకు పెరిగేవి ఉంటాయి. ఇక్కడ స్టాక్ అప్పర్ సర్క్యూట్, లోయర్ సర్క్యూట్‌లకు కొన్ని పరిమితులు ఉంటాయి. ఇక దాదాపు 20 శాతానికి మించి పెరగవు. కానీ ఇప్పుడు అమెరికా స్టాక్ మార్కెట్లో ఒక స్టాక్ ఒక్క సెషన్‌లో 24 శాతానికిపైగా దూసుకెళ్లింది. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి కాసుల పంట పండిందని చెప్పొచ్చు. అదే మార్వెల్ టెక్నాలజీ లిమిటెడ్. కిందటి రోజు ఈ స్టాక్ ధర 219.43 డాలర్లుగా ఉండగా.. ఇవాళ ఒక్కరోజులోనే ఏకంగా 25 శాతానికిపైగా పెరిగి 275 యూఎస్ డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇంట్రాడేలో ఇంకా ఎక్కువే పెరిగి 277.54 డాలర్ల వద్ద సెషన్ గరిష్ఠాన్ని.. 52 వారాల గరిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర 61.15 డాలర్లుగా ఉంది. మార్కెట్ విలువ 23.81 వేల కోట్ల డాలర్లుగా ఉండగా.. భారత కరెన్సీలో ఇది రూ. 22 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. అంటే మన దగ్గర రిలయన్స్ ఇండస్ట్రీస్ కంటే ఎక్కువ విలువైనది. ఇప్పుడు ఈ చిప్ మేకర్ కంపెనీ స్టాక్ ఒక్కసారిగా పెరిగేందుకు ప్రధాన కారణం.. మార్కెట్ వాల్యుయేషన్ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ అయిన ఎన్విడియా బాస్ జెన్సెన్ హువాంగ్ చేసిన ప్రకటనే.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com